ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5

ఆదివారం 7 ఏప్రిల్ 2024

రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.36 | సహర్: 4.43 (సోమవారం)

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.159	231	261
సూర్యాపేట	రూ. 150	220	250
నల్లగొండ	రూ.159	231	262

ఉష్ణోగ్రత	గరిష్ఠం 41.5	కనిష్ఠం 25.0



నల్లగొండ జిల్లాకేంద్రం పరిధిలోని ఆర్జాలబావి సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఎండవేడిమి తట్టుకోలేక నీటిని తాగుతున్న మహిళా రైతు

సూర్య@

44.5 డిగ్రీలు

- వడగాడ్పులతో అల్లాడుతున్న ప్రజలు
- అడుగుంటిన చెరువులు, కుంటలు, కాల్వలు
- నాంపల్లి మండలంలో, పెన్‌పహాడ్ మండలాల్లో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత

భానుడి భగభగలు శనివారం నిప్పుల కుంపటిని తలపించాయి. తీవ్రమైన ఎండ వేడిమికి, ఆగడి గాలు లు తోడవడంతో ప్రజలు విలవిల్లాడారు. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు జిల్లా ప్రజలను భయపెట్టిస్తున్నాయి. తాగునీటి కోసం మూగజీవాలు అల్లాడుతున్నాయి. చెరువులు, కుంటలు, కాల్వలు అ డుగంటిపోవడంతో మూగుజీవాలు నీటి కోసం అల్లాడుతున్నాయి. యాదగిరిగుట్టలో 43.8 డిగ్రీ ల ఉష్ణోగ్రదంతో భక్తులు చలువ పందిళ్ల కింద సేదతీరారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో శనివారం అత్యధికంగా నాంపల్లి మండలంలో, పెన్‌పహాడ్ మండలాల్లో 44.5 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రత న మోదైంది. నల్లగొండ జిల్లా నాంపల్లి మండలంలో అత్యధికంగా 44.5 డిగ్రీలు, అత్యల్పంగా చింతపల్లి మండలంలో గొడకండ్ల 39.9 డిగ్రీలు, యాదాద్రి భు వనగిరి జిల్లా గుట్టలో అత్యధికంగా 43.8 డిగ్రీలు, తుర్కపల్లి మండలం మన్నెవారి తుర్కపల్లిలో అత్యల్పంగా 39.1 డిగ్రీలు, సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్‌లో అత్యధికంగా 44.5 డిగ్రీలు, అత్యల్పంగా తుంగతుర్తి మండలంలో 40.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



భువనగిరి పరిధిలోని భువనగిరి-భూదాన్‌పోచంపల్లి రహదారిలో చున్నీ గొడుగుతో ప్రయాణం..

ఎండల ఎఫెక్ట్.. చెక్‌పోస్టు బంద్



నిర్మానుష్యంగా చెక్‌పోస్టు

ఎండల తీవ్రత అధికమవుతుండటంతో ప్రజలు, అధికారులు బయటకు వెళ్లలేని పరిస్థితి. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వెలువడినప్పటి నుం చి భువనగిరి మండలం రాయిగిరి-మోత్కూరు రహదారిపై పోలీసు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. భువనగిరి లోక్‌సభ పరిధిలోని ఈరోడ్డు వెంట చెక్‌పోస్టును ఏర్పా టు చేసి సీసీ కెమెరాల ద్వారా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. అయితే ఎండలలు అధికంగా ఉండడంతో వాహన తనిఖీలకు విరామం ప్రకటించారు. ఓ పది రోజుల తర్వాత తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిసింది.

- నల్లగొండ, భువనగిరి అర్బన్

ప్రభుత్వాన్ని నిద్ర లేపడానికే రైతు దీక్షలు

జడ్పీ చైర్మన్ బండానరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



నల్లగొండలో దీక్షలో పాల్గొన్న జడ్పీ చైర్మన్ బండానరేందర్‌రెడ్డి, కంచర్లభూపాల్‌రెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 6: రాష్ట్రంలోని మొద్దు ప్రభుత్వాన్ని నిద్ర లేపడానికే రైతు దీక్షలు చేస్తున్నామని జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. వంద రోజుల కాం గ్రెస్ పాలనలో 200 మంది రైతులు చనిపోయారని, అయినా వారి కుటుంబాలను ఏ ఒక్క మంత్రీ పరామర్శించకపోవడం సిగ్గుచేటన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శనివారం స్థానిక గడియారం సెంటర్‌లో రైతు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండిన పంటపొలాలను చూడడానికి మంత్రులకు సమయం లేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు లేక, నీళ్ల రాక రైతులకు కన్నీళ్లే మిగిలాయన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల పరిహారం చెల్లించాలని, ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు రూ.20లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకు లు చిల్లర మాటలు మాని, రైతులను కాపాడాలన్నారు. రైతులకు ఇచ్చిన హామీల్లో రూ.2లక్షల రైతు రుణమాఫీ, రైతుబంధు రూ.15వేలు అమలు చేయాలన్నారు. మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామన్న బీజేపీ కూడా మాట తప్పిందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్, కేంద్రంలోని బీజేపీ దొందూ దొందే అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తప్పకుండా గుణపాఠం చెబుతారన్నారు. హామీల అమలులో మాట తప్పిన కాంగ్రెస్‌కు మళ్లీ మేనిఫెస్టో పెట్టే నైతిక అర్హత లేదన్నారు. రైతులకు మేలు చేసే దాకా బీఆర్‌ఎస్ పోరాడుతుందన్నారు. రైతులందరూ ధైర్యంగా ఉండాలని, ఎవరూ ఆత్మహత్య చేసుకోవద్దని, వారికి తాము అండగా ఉంటామన్నారు. దీక్షలో కనగల్ ఎంపీపీ కరీమ్‌పాషా, మునిసిపల్ మాజీ చైర్మన్ సైదిరెడ్డి, తిప్పర్తి మాజీ జడ్పీటీసీలు తండు సైదులుగౌడ్, తుమ్మల లింగస్వామి, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, సీనియర్ నాయకులు బక్క పిచ్చయ్య, కొండూరు సత్యనారాయణ, బకరం వెంకన్న, కంచనపల్లి రవీందర్‌రావు, గాయకుడు చింతల యాదగిరి, కౌన్సిలర్లు యామా కవితా దయాకర్, మారగోని గణేష్, పార్టీ పట్టణ అధక్షుడు బోనగిరి దేవేందర్, పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్య, దేప వెంకట్‌రెడ్డి, పల్‌రెడ్డి రవీందర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నంరాజు, నందినేని జనార్దన్‌రావు, ఏనుగు వెంకట్ రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

తాగునీరు, ధాన్యం కొనుగోళ్లే ప్రధాన ఎజెండా

● నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

నల్లగొండ, ఏప్రిల్ 6: జిల్లావ్యాప్తంగా తాగునీటి సమస్యతోపాటు ధాన్యం కొనుగోళ్లే ప్రధాన ఎజెండాగా ఆదివారం నాడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగే అవకాశాలు ఉన్నాయి. జడ్పీ పాలక వర్గం ఏర్పడి దాదాపు నాలుగన్నరేళ్లకు పైగా దాటింది. నిబంధనల మేరకు ప్రతీ మూడు నెలలకొకసారి జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ సమావేశం సాదాసీదాగా జరగనుంది. ఈ జడ్పీ పాలకవర్గం మరోసారి స్టాండింగ్ కమిటీలతోపాటు జనరల్ బాడీ మీటింగ్‌తో గడువు ముగియనుంది. జిల్లా వ్యాప్తంగా తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. భూగర్భజలాలు అడుగంటిపోయాయి. ఇటీవలే నాగార్జునసాగర్ నుంచి తాగునీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. చాలా చోట్ల బోర్లు ఎండిపోయాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు నీటి అవస్థలు ఎదుర్కొంటున్నారు. పట్టణ ప్రాంతాల్లో మూడు, నాలుగురోజులకొకసారి నీటిని విడుదల చేస్తున్నారు. అదేవిధంగా రైతులు ధాన్యం విక్రయాలకు అవస్థలు పడుతున్నారు. మరోవైపు ప్రభుత్వం వెంటనే వరిధాన్యానికి సంబంధించి ప్రతీ క్వింటాకు రూ.500బోనస్ ఇవ్వాలని, నష్టపోయిన పంటలకు సంబంధించి ప్రతీ ఎకరాకు రూ.25వేలు నష్టపరిహారం ఇవ్వాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా పరిషత్ సమావేశంలో జరిగే చర్చపైనే అందరి దృష్టి నెలకొంది.



- లోక్‌సభ ఎన్నికల్లో ఎజెండాగా మారిన అంశం
- ఉమ్మడి నల్లగొండ జిల్లాను కుదిపేస్తున్న కరువు
- పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహిస్తోన్న ప్రతిపక్షాలు
- పంట నష్టపరిహారమివ్వాలనే డిమాండ్లు
- పోటాపోటీ ప్రకటనలతో వేడెక్కిన రాజకీయం



కరువు చుట్టూ రాజకీయం

తెలంగాణ రాక ముందు.. తెలంగాణ వచ్చాక కరువుకు కేరాఫ్ అడ్రస్ ఏదైనా ఉందంటే అది ఉమ్మడి నల్లగొండ జిల్లానే అని చెబుతుంటారు. ఇలాంటి జిల్లా మళ్లీ కరువు రాజకీయాలకు కేంద్ర బిందువైంది. తలాపునే కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్నా.. నల్లగొండ జిల్లాను ఎడారి చేశారంటూ తెలంగాణ రాక ముందు కేసీఆర్ కృష్ణా పరీవాహక ప్రాంతంలో పాదయాత్ర చేశారు. మళ్లీ అదే కరువు పేరుతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని తుంగతుర్తిలో ఇటీవల పర్యటించి, ఎండిన పంట పొలాలను పరిశీలించారు. అయితే ఈ కరువుకు కారణం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అంటూ కాంగ్రెస్ జిల్లా మంత్రులు ప్రకటిస్తున్నారు. దీంతో అటు అధికార పక్షం, ఇటు ప్రతిపక్ష పార్టీల ఆందోళనలు, దీక్షలతో జిల్లా అట్టుడికిపోతోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

లోక్‌సభ ఎన్నికల సమరం ఊపందుకుంటున్న వేళ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కరువు ప్రధానాంశంగా మారింది. యాసంగిలో సాగునీరందక పంటలు ఎండిపోవడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. భూగర్భజలాలు గణనీయంగా పడిపోవడంతో పండ్లతోటలు సైతం ఎండిపోతూ పంట కోల్పోయేలా ఉంది. నాగార్జున సాగర్ ఆయకట్టు కింద క్రాప్‌హాలిడే ప్రకటించినా రైతులు భూగర్భజలాల ఆధారంగా పంటలు సాగుచేయగా, నీరందక ఎండిపోయాయి. రైతాంగం కరువు దెబ్బతో అల్లాడుతున్న సమయంలోనే లోక్‌సభ ఎన్నికల హడావుడి మొదలవడంతో ప్రతిపక్షాలు కరువు అంశాన్నే ప్రధాన ఎజెండాగా ఉమ్మడి జిల్లాలో తెరమీదకు తెచ్చాయి. బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఎం ఉమ్మడి జిల్లాలో కరువు నివారణ చర్యలు డిమాండ్‌చేస్తూ ఆందోళనలకు దిగాయి. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ఆదేశాలు లేకపోయినా, వ్యవసాయ, ప్రణాళిక శాఖల ద్వారా పంటల సాగు, దిగుబడలు వివరాలను నమోదు చేస్తూ, నష్టశాతాన్ని సైతం లెక్కించి నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కరువు ప్రభావం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నాగార్జునసాగర్, కాళేశ్వరం, ఎస్ఆర్ఎస్పీ కింద ఆయకట్టుకు నీరందించలేకపోవడం, భూగర్భజలాలు గణనీయంగా పడిపోవడంతో యాసంగి పంటలు ఎండిపోయాయి. ప్రధానంగా వరిసాగుపై కరువు ప్రభావం ఎక్కువగా పడింది. ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా సాగైన 10.41 లక్షల ఎకరాల వరిసాగులో దాదాపు సగంమేర పంట కోల్పోయినట్లు రైతులు చెబుతున్నారు. ప్రధానంగా నీరందకపోవడంతో పొట్ట దశలో, కంకిదశలో పైర్లు ఎండిపోయాయని దీంతో పెట్టుబడులు కూడా నష్టపోయామని రైతాంగం వాపోతోంది. వరి పైరుతో పాటు భూగర్భజలాల ఆధారంగా సాగయ్యే బత్తాయి, నిమ్మతోటలు ఉమ్మడి జిల్లాలో దాదాపు 85వేల ఎకరాల్లో ఉంటే, వాటికి కూడా నీటి ఎద్దడి నెలకొంది. తోటలను కాపాడుకునేందుకు రైతులు బోర్లమీద బోర్లు వేయడంతోపాటు, ట్యాంకర్ల ద్వారానూ నీటిని సరఫరా చేస్తున్నారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఎం డిమాండ్ చేస్తున్నాయి.

కరువుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్వాకమే కారణమంటోన్న కాంగ్రెస్

ఉమ్మడి జిల్లాలో కరువుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనే కారణమని కాంగ్రెస్‌నేతలు ఎదురుదాడి చేస్తున్నారు. నాగార్జునసాగర్ కేఆర్ఎంబీ పరిధిలోకి వెళ్లడానికి తొలుత అంగీకరించిందే బీఆర్‌ఎస్ హయాంలోనే అని ఆరోపిస్తున్నారు. అదేవిధంగా నాగార్జునసాగర్ ఆయకట్టుకు బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనే వానాకాలం, యాసంగి పంటలకు క్రాప్‌హాలిడే ప్రకటించారని,మూడు నెలలకే అన్ని మర్చిపోయి, కరువుకు కాంగ్రెస్సే కారణమంటూ ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబడుతున్నారు. కాళేశ్వరం పనుల్లో నాణ్యత లోపించడం వల్లే పిల్లర్లు కొట్టుకుపోవడంతో, అక్కడ నీటివిడుదలకు ఆటంకం కలిగిందని, దీనికి కూడా బీఆర్‌ఎస్ నిర్వాకమే కారణమని కాంగ్రెస్ నేతలు బలంగా వాదిస్తున్నారు. కరువును రాజకీయం చేస్తోన్న బీఆర్‌ఎస్ నేతలు అందుకు కారణం వారి పరిపాలనేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచిస్తున్నారు.

జిల్లాలకు ఇన్‌చార్జిలుగా సీనియర్ ఐఏఎస్‌లు

లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ప్రభుత్వం నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలుగానీ, ఉన్నతాధికారులు గానీ పంటల నష్టంపైనా, కరువుపైనా ఎలాంటి అధికారిక ప్రకటనలు చేయడంలేదు. అయితే తాగునీటి ఎద్దడి నెలకొనకుండా ఇప్పటికే సీనియర్ ఐఏఎస్ అధికారులను జిల్లాలకు ఇన్‌చార్జిలుగా నియమించడంతోపాటు, తాగునీటి సరఫరాకు ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక నిధులు కేటాయించడంతోపాటు కార్యాచరణను అమల్లోకి తెచ్చారు. అదేవిధంగా పంట కోత నమూనాలు కూడా సేకరించి పంటల దిగుబడి వివరాలు, తగ్గిన దిగుబడుల వివరాలను సేకరిస్తున్నారు. క్షేత్రస్థాయి నుంచి వచ్చే నివేదికలను ప్రభుత్వానికి సమర్పించడం ద్వారా ప్రభుత్వం ఎప్పుడు సూచిస్తే అప్పుడు జిల్లాలో పరిస్థితిపై సమగ్ర నివేదికను అందించేందుకు వీలుగా వ్యవసాయ, ప్రణాళిక శాఖలు పంటల దిగుబడుల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, అవగాహనారాహిత్యం వల్లే కరువు ఏర్పడిందని, ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువంటూ ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. మాజీ సీఎం కేసీఆర్ కరువు నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పర్యటించి ఎండిన పంటలను పరిశీలించారు. సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో పర్యటించిన ఆయన ఎకరాకు రూ.25వేల పంట నష్టపరిహారమివ్వాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ల ద్వారా తక్షణం ఎండిన పంటల వివరాలను సేకరించి కరువు సహాయక చర్యలకు ప్రభుత్వం ఆదేశించాలని డిమాండ్‌చేశారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం నల్లగొండలో నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న పండ్లతోటలను పరిశీలించి, పండ్లతోటల రైతులను పరామర్శించి, పంటనష్టపరిహారాన్ని డిమాండ్ చేశారు. తాజాగా శనివారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో అన్ని నియోజకవర్గకేంద్రాల్లో రైతుదీక్షలు కొనసాగించారు. మరోవైపు బీజేపీ సైతం ఉమ్మడి జిల్లాలో ఎండిన పంటలకు పంట నష్టపరిహారమివ్వాలని డిమాండ్ చేస్తోంది. ఆపార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రైతు సత్యాగ్రహదీక్షలు నిర్వహించారు. సీపీఎం ఆధ్వర్యంలో ఇప్పటికే గ్రామాల్లో పర్యటించి పంటనష్ట పరిస్థితిని పరిశీలించారు. పలు గ్రామాల్లో సర్వేలు నిర్వహించి కరువును నిర్ధారించారు. పంటలు ఎండడంతోపాటు తాగునీటి ఎద్దడి ఏర్పడుతోందని ప్రభుత్వ అధికారయంత్రాంగం తక్షణం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సీపీఎం డిమాండ్ చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో ప్రతిపక్ష పార్టీలన్నీ వరుసగా కరువు, పంట నష్టంపై ఉద్యమిస్తుండడంతో కరువురాజకీయం ఎజెండాగా మారింది.

కరువుపై పోటాపోటీ కార్యక్రమాలు

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

రాష్ట్ర సివిల్ సప్లయి డిప్యూటి కమీషనర్ పద్మజ



చీమలగడ్డలో ధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న అధికారులు

నకిరేకల్, ఏప్రిల్ 6: రైతులకు ఇబ్బంది కలిగించకుండా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సివిల్ సప్లయి రాష్ట్ర డిప్యూటీ కమిషనర్ పద్మజ అన్నారు. నకిరేకల్‌లోని చీమలగడ్డ పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండలు బాగా ఉన్నందున ధాన్యం కొనుగోలు సెంటర్లలో వాటర్, షెడ్స్, విద్యుత్ సరఫరా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఆమె సమస్యలు ఆమె వెంట జిల్లా ఫౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలి

ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 6: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న యువత, విద్యార్థులు తప్పనిసరిగా ఓటేసి ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డా.గోపాల్‌రెడ్డి, సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ బొమ్మరబోయిన కేశవులు అన్నారు. ఎంజీయూ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం విశ్వవిద్యాలయం సెమినార్ హాల్లో 'ఓటు హక్కు ను వినియోగించుకుందాం-ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం' అంటూ నిర్వహించిన చర్చవేదికకు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరక్షరాస్యులు, పేదలు ఓటింగ్‌లో పాల్గొంటుంటే, పట్టణ ప్రాంతాల్లో చదువుకున్న వారే ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నారన్నారు.

ఇటీవల జరిగిన ఎన్నికల్లో హైదరాబాద్‌లో 32శాతం మాత్రమే పోల్ అవడం ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. యూనివర్సిటీ విద్యార్థులు వందశాతం ఓటింగ్‌లో పాల్గొనాలని చెప్పారు. అధికార యంత్రాంగం ఎన్నిక లు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసిందని, ఓటర్లుగా మనవంతు బాధ్యతగా ఓటు వేయాలన్నారు. దేశ భవిష్యత్ యువత చేతిలోనే ఉందని, ఈ ఎన్నికల్లో యువత తప్పని సరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతీ ఓటు విలువైనదని, మంచి అభ్యర్థులను ఎన్నుకోవాలన్నారు.ఈ సందర్భంగా వీసీ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో యంజీయూ ఓఎస్డీ అంజిరెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి, సలహాదారులు భాస్కర్ రెడ్డి, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో రూ.1400 కోట్లు



నల్లగొండ, ఏప్రిల్ 6: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లాభాల బాటలో పయనిస్తోంది. 103 ఏళ్ల బ్యాంకు చరిత్రలో అప్పటివరకు కేవలం రూ.900కోట్ల టర్నోవర్ తోనే ఉండగా ఈనాలుగేళ్లలో రూ.2300కోట్ల టర్నోవర్‌కు చేరింది. దాదాపు రూ.1400 కోట్ల ఆదాయాన్ని డీసీసీబీ సమకూర్చుకో గలిగింది. 2020 ఫిబ్రవరి 20న ఈ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన తర్వాత బ్యాంకును లాభాల దిశకు చేరుకునేలా నిర్ణయాలు తీసుకుందని చెప్పవచ్చు. ఎంసీ మీటింగ్‌లతోపాటు మహాజన సభలను నిర్వహిస్తూ అటూ సొసైటీ చైర్మన్లు, బ్యాంకుల సీఈవోలతో, డీసీసీబీ అధికారులు, ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ పాలకవర్గ డీసీసీబీని ముందుకు తీసుకుపోయింది. ప్రతీ ఏటా నిర్వహించిన మాదిరిగానే ఈ ఏడాది కూడా ఆడిట్ చేయగా ఈ నాలుగో ఆడిట్‌లో బ్యాంకు అభివృద్ధిలో పయనిస్తున్న విషయాలను తాజాగా వెల్లడించారు. నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలో మొత్తం 107 సొసైటీలు ఉన్నాయి. అదేవిధంగా బ్రాంచ్‌లను కూడా పెద్దఎత్తున విస్తరించారు. రైతులకు రుణాలు అధికంగా ఇవ్వడంతోపాటు రికవరీ కూడా అంతేవేగంగా చేస్తూ వచ్చారు. వాణిజ్య బ్యాంకుల కంటే అధికంగా రుణాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇక బంగారు రుణాలు కూడా పెద్దఎత్తున అందజేయడం, డిపాజిట్‌లను సమకూర్చుకోవడం ద్వారా లాభాలు వచ్చాయని చెప్పవచ్చు.


1.83 శాతానికి తగ్గిన నిరర్ధక ఆస్తులు

డిపాజిట్లను గత నాలుగేళ్లలో రూ.370కోట్ల నుంచి రూ.674 కోట్ల వరకు డిపాజిట్‌లను తెచ్చుకోగలిగారు. అదేవిధంగా 2020లో 11శాతం ఉన్నఎన్‌పీఏ (నిరర్ధక ఆస్తులు) ప్రస్తుతం 1.83శాతానికి చేరడంతో బ్యాంకు లాభాలను గడించింది. ఇక ప్రస్తుతానికి రూ.30.16కోట్ల గ్రాస్ ప్రాఫిట్ ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరంలోనే రూ.22.42కోట్ల నెట్ ప్రాఫిట్‌కు చేరుకుంది. బ్రాంచ్ విస్తరణతోపాటు సొసైటీల బలోపేతం ఆధునికీకరణకు, రైతులకు సేవలను విస్తరించడంతో బ్యాంకులు పురోగతికి చేరుకున్నాయి. దీంతో ఎప్పటికప్పుడు ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడం కూడా రైతులకు సేవలను సత్వరమే అందించడం, రుణాలను వాణిజ్య బాంకులకు అందిస్తుండటంతో లాభాలు పెరుగుతున్నాయని చెప్పవచ్చు. వాస్తవానికి అయితే రైతులకోసం, రైతుల ద్వారా ఏర్పడిన జిల్లా సహకార బ్యాంకు 103 ఏళ్ల చరిత్రలో పెద్దగా మార్పు సాధించలేకపోయింది. అయితే ఈ నాలుగేళ్లలో సంస్కరణల మూలంగా బ్యాంకు మహర్దశకు చేరిందని అధికారులు పేర్కొంటున్నారు.

రైతుల్లో పెరిగిన అవగాహన

సహకార బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతుల్లో సైతం అవగాహన పెరిగిందని చెప్పవచ్చు. స్వల్పకాలిక రుణాలతోపాటు, దీర్ఘకాలిక రుణాలు, వ్యక్తిగత రుణాలు, బంగారం రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లిస్తుండటం విశేషం. వడ్డీ భారం పడకముందే రుణాలు తిరిగి చెల్లించి రెన్యూవల్ చేసుకుంటున్నారు. దాదాపు 95శాతం మేరకు రైతులు సకాలంలోనే చెల్లింపులు చేస్తున్నట్లు సమాచారం.

బ్యాంకు అభివృద్ధే లక్ష్యంగా పాలకవర్గం కృషి



ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా పీఏసీఎస్‌లు, బ్రాంచ్‌లు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు లాభాల బాటలో తీసుకపోయే విధంగా తమ పాలకవర్గం కృషి చేస్తోంది. 103 ఏళ్లలో చేయలేని అభివృద్ధిని ఈ నాలుగేళ్లలో ఈ పాలకవర్గం చేయడం ఎంతో సంతోషకరమైన విషయం. ఆడిట్ బృందాలు ప్రతీ ఏటా నిర్వహిస్తున్న ఆడిట్ ద్వారా డీసీసీబీ ఎంత పెద్ద అభివృద్ధికి చేరుకుందనేది స్పష్టమయింది. నాలుగేళ్ల క్రితం రూ.900కోట్లు మాత్రమే టర్నోవర్ ఉంటే తమ పాలకవర్గం బాధ్యతలు చేపట్టాక రూ.2300కోట్ల మేరకు టర్నోవర్ చేరుకోవడంతో డీసీసీబీకి రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు లభించింది.

- గొంగిడి మహేందర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ నల్లగొండ

'మోదీ మళ్లీ వస్తే ఉపాధి హామీ, ప్రజాపంపిణీ వ్యవస్థ ఎత్తేస్తారు'

చిట్యాల రూరల్, ఫిబ్రవరి 6: కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారం చేపడితే ఉపాధిహామీ పథకం, ప్రజాపంపిణీ వ్యవస్థను ఎత్తేస్తారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య ఆరోపించారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి, ఆరెగూడెంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు కేంద్ర ప్రభుత్వమే కారణమని ఆరోపించారు.

పంటకు ప్రాణం పోసేందుకు..





కాల్వలో వేసిన పైపులు



కాల్వ గట్టుపై ఏర్పాటు చేసిన మీటర్లు

కరువు విలయతాండవం చేస్తున్న వేళ కర్షకుడికి కంటిమీద కునుకు లేకుండా అయ్యింది. సకాలంలో వర్షాల్లేక, రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో పంటలు ఎండిపోతున్నాయి. పచ్చని పొలాల్లో జలసిరులు కరువై నెర్రెలుబారాయి. ఇలాంటి తరుణంలో ఉన్న కొద్దిపాటి నీటిని పంట చేలకు తరలించేందుకు రైతన్న తీరొక్క ఉపాయం చేస్తున్నాడు. ఇందులో భాగంగానే నల్లగొండ మండల పరిధిలోని దండంపల్లి సమీపంలోని కాల్వలో మోటారు వేసి, నీటిని పంట పొలాలకు తరలించే ప్రయత్నం చేస్తున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

ప్రకృతి వైపరీత్యానికి..



మృత్యువాత పడిన చేపలు

ప్రకృతి వైపరీత్యానికి పశుపక్ష్యాదులు, జలచరాలు పిట్టల్లా రాలుతున్నాయి. చెరువులు, కుంటలు అడుగంటడంతో నీరు లేక చేపలు మృత్యువాత పడుతున్నాయి. నల్లగొండ జిల్లాకేంద్రం సమీపంలోని వల్లభరావు చెరువులో చేపలు మృత్యువాతపడగా, వాటిని తినేందుకు కొంగలు ఎగబడ్డాయి.

బాణసంచా తయారీ
కేంద్రంలో పేలుడు

ముగ్గురికి గాయాలు

చిట్యాల, ఏప్రిల్ 6: ఎలాంటి అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేస్తున్న ఓ ఇంటిలో పేలుడు సంభవించడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. శనివారం నల్లగొండ జిల్లా చిట్యాల మునిసిపాలిటీలోని సంతోష్‌నగర్‌లో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ సైదాబాబు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఏపీ రాష్ట్రం గుంటూరుకు చెందిన కోటేశ్వరరావు చిట్యాలలోని సంతోష్‌నగర్‌లో మేకల యాదయ్య ఇంటిని అద్దెకు తీసుకుని కొంతకాలంగా బాణసంచా(ఉల్లిగడ్డ బాంబులు) తయారు చేయించి గుంటూరుకు సరఫరా చేస్తున్నాడు. స్థానికంగా కొంతమంది మహిళలు అందులో పనిచేస్తున్నారు.శనివారం ఉదయం 11గంటల సమయంలో బాణసంచా తయారు చేస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో బాణసంచా తయారీ కేంద్రం నిర్వాహకుడు కోటేశ్వరరావు ఎడమచేయి మోచే తివరకు పూర్తిగా తెగిపడింది. అక్కడ పనిచేస్తున్న వనిపాకల గ్రామానికి చెందిన గుడిసె శాంతి, బాణోతు సైదమ్మలకు గాయాలయ్యాయి. కొంగర శ్రావణి, కర్రె కవిత ఇంటి బయట ఉండటంతో వారికి ఎలాంటి గాయాలు కాలేదు. పేలుడు ధాటికి ఇంటి తలుపులు విరిగి బయటకు వచ్చాయి. పెద్దశబ్దంతో ఉలిక్కిపడిన స్థానికులు అప్రమత్తమై పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలాన్ని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, తహసీల్దార్ కృష్ణ, సీఐ నాగరాజు, ఎస్‌ఐ సైదాబాబు పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం,బాంబ్ డిస్పోజబుల్ బృందాలు పరిశీలించాయి.గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేనిఆసుపత్రికి తరలించారు. ఈఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐసైదాబాబు తెలిపారు.

ఇళ్ల మధ్యే తయారు చేస్తున్నా...

సంతోష్‌నగర్‌లో ఇళ్ల మధ్యే ఎలాంటి అనుమతులు లేకుండా ప్రమాదకరంగా బాణసంచా తయారు చేస్తున్నా ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. అంతేకాకుండా తయారీ కేంద్రంలో ఇటీవల చిన్న చిన్న ప్రమాదాలు కూడా జరిగినట్లు తెలిసింది.

అమ్మ ఆదర్శం

పల్లెలే దేశానికి పట్టుగొమ్మలన్న మహాత్ముడి మాటల ఆలోచనలను నిజం చేయడంలో ప్రభుత్వ పాఠశాలల పాత్ర కీలకమని ప్రభుత్వం గుర్తించింది.ఇందుకోసం 'అమ్మ ఆదర్శ' కమిటీలను ఏర్పాటు చేసింది. తల్లి సంరక్షణలో ఇల్లు ఎంత పకడ్బందీగా, పటిష్ఠంగా ముందుకు సాగుతుందో, అదే రీతిలో పాఠశాలల మనుగడ కూడా సాగాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పల్లె బడుల నిర్వహణ బాధ్యతలను మహిళలకు అప్పగించింది. ఇక నుంచి పాఠశాలల్లో మెరుగైన వసతులు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, చిన్నారులకు తాగునీరు అందించే చర్యలకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

- మోత్కూరు

- ఇక తల్లులకే పాఠశాలల బాధ్యత
- ఎస్‌ఎంసీల స్థానంలో మహిళా సంఘాల వీవోలు
- పూర్తయిన ప్రక్రియ
- ఉమ్మడి జిల్లాలో 3143 సంఘాలు



ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ బాధ్యత ఎస్‌ఎంసీలకు బదులుగా మహిళా సంఘాలకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మహిళా సంఘాలకు బాధ్యతలు అప్పగించడం వల్ల బడులు మరింత బాగుపడటంతోపాటు సంఘాల్లోని మహిళలకు పని కల్పించనట్లవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎస్‌ఎంసీ ఎన్నికలకు ఫిబ్రవరిలో తేదీలు కూడా ప్రకటించి, ఎన్నిక ప్రక్రియను నిలిపివేసి మహిళా సంఘాలకు అప్పగించాలన్న నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో 'అమ్మ ఆదర్శ కమిటీ'లు ఏర్పాటయ్యాయి.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3,143 పాఠశాలలు

ఉమ్మడి జిల్లాలో 3,143 పాఠశాలలున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో 481 ప్రాథమిక, 68 ప్రాథమికోన్నత, 163 ఉన్నత పాఠశాలలున్నాయి. సూర్యాపేట జిల్లాలో 690 ప్రాథమిక, 78 ప్రాథమికోన్నత, 182ఉన్నత, నల్లగొండ జిల్లాలో 1126 ప్రాథమిక, 126 ప్రాథమికోన్నత, 229 ఉన్నత పాఠశాలలున్నాయి.

పాఠశాల పేరుతో కొత్త ఖాతాలు

గతంలో ఎస్‌ఎంసీ చైర్మన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాయింట్ సంతకాలతో బ్యాంకులో పాఠశాల ఖాతా ఉండేది. వాటి స్థానంలో 'అమ్మ ఆదర్శ' కమిటీల నుంచి ఎంపికైన చైర్మన్, హెచ్‌ఎం కలిసి బ్యాంకుల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పేరున కొత్త ఖాతాలు తెరిచారు. ఇక పాఠశాల అభివృద్ధి నిధులు ఆ ఖాతాలోనే జమవుతాయి. ఇద్దరికీ చెక్ పవర్ ఉంటుంది. ఆర్థిక లావాదేవీలు, అభివృద్ధి పనుల మంజూరుకు పాఠశాల కమిటీ తీర్మానం చేయాలి. తీర్మానాలు చేయడానికి 50 శాతం కమిటీ సభ్యులు హాజరుకావాలి.

కమిటీల విధులు, బాధ్యతలు

అమ్మఆదర్శ కమిటీలు పాఠశాలల నిర్వహణలో పాలుపంచుకోనున్నాయి. పాఠశాలలను బలోపేతం చేయడం, తాగునీటి సౌకర్యాలు, పాఠశాలల మరమ్మతులు, మరుగుదొడ్ల సౌకర్యం, పారిశుధ్య నిర్వహణ, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, విద్యార్థులకు యూనిఫాం తయారీ తదితర అంశాలు ఈ కమిటీలు చేపట్టాల్సి ఉంటుంది. మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది.

కమిటీల నిర్మాణం ఇలా..

ఆయా గ్రామ, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు (వీవో) పాఠశాల కమిటీకి చైర్మన్‌గా, హెచ్‌ఎం కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ప్రతీ తరగతికి ముగ్గురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకుంటారు. వీరురెండేళ్ల పదవిలో కొనసాగుతారు. వీరు స్వయం సహాయక సంఘం (ఎస్‌హెచ్‌జీ) సభ్యులై ఉండాలి. ఈ ముగ్గురిలో ఒకరు ఎస్సీ లేదా ఎస్టీ ఉండాలి. గ్రామంలో ఒకే వీవో ఉండి పాఠశాలలు ఎక్కువగా ఉన్నట్లయితే అన్ని పాఠశాలలకు ఆమే చైర్‌పర్సన్‌గా ఉంటారు. ఎక్కువ మంది వీవోలు ఉండి, ఒకే పాఠశాలల ఉంటే రొటేషన్ పద్ధతిలో చైర్‌పర్సన్‌గా ఉంటారు.

రూ.25వేల వరకు టెండర్లు లేకుండా పనులు

పాఠశాలల్లో చేపట్టే అభివృద్ధి పనులు రూ.25వేలలోపు టెండర్లు లేకుండా చేసే అవకాశం కల్పించారు.అంతకు మించిన పనులు ఉంటే, టెక్నికల్ కమిటీలు జిల్లా సమాఖ్యల ద్వారా పాలనాధికారులకు నివేదిస్తాయి. ఏఈ, డీఈ పనుల రికార్డులు ఎంబీలో నమోదు చేస్తారు. రూ.లక్ష దాటితే కలెక్టర్ల పర్యవేక్షణలో బిల్లు చెల్లిస్తారు. పనులు పూర్తయ్యాయని హెచ్‌ఎం ధ్రువీకరించిన తర్వాతే బిల్లులు చెల్లిస్తారు.

ఉపాధి హామీ పథకం నిధులు, ప్రత్యేకాభివృద్ధి నిధులతో ఇతర ప్రభుత్వ సంస్థలు ఇచ్చే నిధులతో పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపడతారు. నిర్వహణ, పర్యవేక్షణ కోసం ఆయా పనుల విలువలో మూడుశాతం నిధులను సర్వీస్ చార్జీల కింద కమిటీలకు చెల్లిస్తారు.

మహిళా సంఘాలకు అవకాశం ఇవ్వడం హర్షణీయం



పాఠశాలల నిర్వహణలో పాలుపంచుకునే అవకాశం మహిళా సంఘాలకు ఇవ్వడం హర్షణీయం. నేను మోత్కూరు జడ్పీ ఉన్నత పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యాను. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు, సరైన పర్యవేక్షణ, విద్యార్థుల హాజరుశాతం పెంచేందుకు కృషి చేస్తా.

- దబ్బెటి శైలజ, మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ, చైర్‌పర్సన్

పురుగుల మందు కలిపిన నీరు తాగి
11 ఆవులు మృతి



విషతుల్యమైన నీరు తాగి మృతి చెందిన ఆవులు

చందంపేట, ఏప్రిల్ 6: పురుగుల మందు కలిపిన నీరు తాగి 11 ఆవులు మృతి చెందాయి. నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం బచ్చాపురంలో శనివారం ఈ సంఘటన జరిగింది. చందంపేట ఎస్‌ఐ, నేరేడగొమ్ము ఇన్‌చార్జి ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం... బచ్చాపురం గ్రామానికి చెందిన రైతులు కేతావత్ వెంకట్రాం, మోతీలాల్, మోహన్, కిషన్,హరియాలు తమకు చెందిన 11ఆవులను శనివారం ఉదయం గ్రామ శివారులో మేతకు వదిలివెళ్లారు. మధ్యాహ్న సమయంలో స్థానికంగా ఉన్న ఓ తోటలో ఆవులు మృత్యువాత పడినట్లు స్థానికులు సమాచారం ఇవ్వటంతో రైతులు అక్కడికి వెళ్లారు. కేతావత్ సతీష్‌కు చెందిన ఆయిల్‌పాం తోటలో పురుగుల మందు పిచికారీ చేయడానికి సిద్ధంగా ఉంచిన డ్రమ్ములోని నీటిని తాగి మృతిచెందినట్లు గుర్తించారు. డ్రమ్ములో పురుగుల మందు కలిపి ఆవుల మృతికి కారకుడైన తోట యజమాని సతీష్‌పై చర్య తీసుకువాలని బాధిత రైతులు నేరేడుగొమ్ము పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఒక్కో ఆవు విలువ రూ.20వేల నుంచి 50వేల వరకు ఉంటుందని, తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ ఘటనపై తోట యజమాని కేతావత్ సతీష్ మాట్లాడుతూ ఈ ఘటనకు తాను కారణం కాదని, తాము చెట్టు కింద ఉంచిన డ్రమ్ములో నీటిని తాగి మృతి చెందాయన్నారు. ఆవులను పంచనామా కోసం పశువైద్యశాలకు తరలించగా, ప్రాథమిక సమాచారం మేరకు ఆవులు విషపు నీరు తాగి మృతిచెందినట్లు పశువైద్యాధికారి రవి తెలిపారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

రూ.1.93కోట్ల విలువైన గంజాయి దహనం

» నల్లగొండ జిల్లా ఎస్పీ చందనా దీప్తి ఆధ్వర్యంలో నిర్వహణ » డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి



నార్కట్‌పల్లి మండలంలోని గుమ్మలబావి శివారులో గంజాయిని కాల్చివేస్తున్న ఎస్పీ చందనాదీప్తి

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 6: నల్లగొండ సబ్ డివిజన్ పరిధిలో మూడేళ్ల వ్యవధిలో 26 కేసుల్లో స్వాధీనం చేసుకున్న రూ.1.93 కోట్ల విలువైన గంజాయి నిల్వలను పోలీసులు దహనం చేశారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం గుమ్మలబావి శివారులోని 12వ బెటాలియన్‌కు చెందిన పోలీస్ ఫైరింగ్ రేంజ్ స్థలంలో సుమారు రూ.1.93 కోట్ల విలువైన 1,379 కిలోల గంజాయి నిల్వలను కోర్టు ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాల జిల్లా నిర్వీర్య కమిటీ ఆధ్వర్యంలో శనివారం దహనం చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ జిల్లా ఎస్పీ చందనాదీప్తి మాట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతామని అన్నారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే సబ్ డివిజన్ పరిధిలో మూడేళ్ల వ్యవధిలో మొత్తం 26 కేసులకు సంబంధించి స్వాధీనం చేసుకున్న గంజాయి నిల్వలను దహనం చేశామన్నారు. జిల్లాలో గంజాయి సాగు లేకున్నా ఇతర రాష్ట్రాల నుంచి జిల్లా పరిధిలోని జాతీయ రహదారి మీదుగా రవాణా చేస్తుండటంతో నిఘా పెట్టి పట్టుకున్నట్లు తెలిపారు. మాదక ద్రవ్యాలు, గంజాయిని రవాణా చేసినా, విక్రయించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఎస్పీ హెచ్చరించారు. డ్రగ్స్ నియంత్రణ, ఎన్‌డీపీఎస్ యాక్టుపై పోలీసులకు శిక్షణ ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. గంజాయి నిల్వలను నిర్వీర్యం చేసే ప్రక్రియను విజయవంతంగా చేసిన డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ సైదులును ఎస్పీ చందనా దీప్తి అభినందించారు. ఈ కార్యక్రమంలో నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్‌ఐ అంతిరెడ్డితో పాటు సబ్ డివిజన్ పరిధిలోని సీఐ, ఎస్‌ఐలు పాల్గొన్నారు. విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ రాములునాయక్, డీఎస్పీ శివరాంరెడ్డి పాల్గొన్నారు.

యాదగిరిక్షేత్రంలో
శాస్త్రోక్తంగా నిత్య పూజలు



భువనగిరిఅర్బన్, ఏప్రిల్ 6:యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో శనివారం పూజల సందడి నెలకొంది. ఇష్టదైవాల దర్శనార్థం భక్తజనులు సాధారణ సంఖ్యలో ఇక్కడకు తరలివచ్చారు. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన ఆచార్యులు పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. తీర్థజనులతో కొండపైన ఉభయ దర్శన క్యూలైన్లు, ప్రధానాలయం, ప్రసాద విక్రయశాల, తిరువీధులు, ఘాట్‌రోడ్డుతో పాటు కొండకింద కల్యాణకట్ట, లక్ష్మీపుష్కరిణీ తదితర ప్రాంతాలు భక్తులు సాధారణంగానే ఉన్నారు. 43.8డిగ్రీల ఎండ తీవ్రతకు తట్టుకోలేక కొండపైన భక్తులు తిరగలేకపోయారు. కేవలం ఉత్తర భాగంలో ఇటీవల ఏర్పాటు చేసిన షెడ్ నీడలో సేద తీరారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారికి మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 27,79,764 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.

చైన్‌స్నాచర్‌ను ఎదిరించిన మహిళ

» పలువురి ఇళ్లలోకి వెళ్లిన ఆగంతకుడు » సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండల కేంద్రంలో ఘటన

నేరేడుచర్ల, ఏప్రిల్ 6: చైన్ స్నాచింగ్ చేసేందుకు ఇంట్లోకి ప్రవేశించిన ఓ ఆగంతకుడిని ఆ ఇంటి యజమానురాలు ఎదిరించింది. ఆ ఆగంతకుడిపై ఆమె దాడి చేయడంతోపాటు కేకలు వేయగా ఇంటి చుట్టుపక్కలవారు రావడంతో ఆ ఆగంతకుడు పరారయ్యాడు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలోని విద్యానగర్‌లో శనివారం ఈ ఘటన జరిగింది. స్థానికులు, నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విద్యానగర్‌కు చెందిన వేదపండితుడు ఇరువంటి శ్రీపాదశర్మ ఉదయం స్థానికంగా ఉన్న దేవాలయంలో పూజలు నిర్వహించడానికి వెళ్లాడు. ఉదయం 11గంటల సమయంలో శ్రీపాదశర్మ భార్య అరవిందసాయి ఇంట్లో ఉండగా ఓ గుర్తుతెలియని వ్యక్తి వచ్చి, తనకు చెవుడు అంటూ సైగలు చేసి, కాగితంపై రాసుకువచ్చిన ఓ చీటీని చూపే ప్రయత్నం చేశాడు. తన భర్త పూజారి కావడంతో జాతకం కోసం వచ్చి ఉంటాడనుకున్న అరవిందసాయి, తలుపు తీసి నీవు ఎవరు? అని ప్రశ్నించగా .. ఏదో మాట్లాడాడు. 'నీకు మాటలు వచ్చు- చెవుడంటూ నటిస్తూ ఎందుకు లోపలికి వస్తున్నావ్?' అని ప్రశ్నించగా, అతడు గేటు వద్దకు వెళ్లాడు. బయటికి వెళ్లమని అరవిందసాయి అంటుండగానే, ఒక్క ఉదుటన మీదకు వచ్చి చైన్‌స్నాచింగ్ చేసేందుకు యత్నించాడు. అరవిందసాయి అక్కడే ఉన్న ఫైబర్ స్టూల్‌ను తీసుకుని పెద్దగా అరుస్తూ అతడిపై దాడి చేసింది. అరవిందసాయి కేకలకు ఇంటి చుట్టుపక్కల మహిళలు రావడంతో గుర్తు తెలియని వ్యక్తి పరారయ్యాడు. ఇంటికి వచ్చిన వ్యక్తి నీలి రంగు చొక్కా, కళ్ల జోడు ధరించి ఎత్తుగా ఉన్నాడని తెలిపారు. నేరేడుచర్లలో మరికొందరి ఇళ్లలోకి కూడా ఆ ఆగంతకుడు వెళ్లగా, మహిళలు తలుపులు తీయకుండానే బెదిరించడంతో వెళ్లిపోయాడు. విద్యానగర్‌లోని కట్టా లచ్చిరెడ్డి ఇంట్లోకి వెళ్లి, ఎంతకూ బయటికి వెళ్లలేదు. అదే సమయంలో ఇంటికి వచ్చిన లచ్చిరెడ్డి ఆ ఆగంతుకుడిని బలవంతంగా బయటికి పంపారు. ఈ విషయం సోషల్ మీడియా ప్రచారం కావడంతో పట్టణంలో విద్యానగర్‌లో ఆగంతకుడు సంచరించిన ప్రాంతాల్లో సీసీ ఫుటేజీలను పరిశీలించి, విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మండలంలో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నారని, అలాంటి వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ సూచించారు.



నేరేడుచర్లలోని విద్యానగర్‌లో ఓ ఇంటిలోకి చొరబడినట్లు సీసీ కెమెరాలో నమోదైన గుర్తుతెలియని వ్యక్తి

నల్లగొండలో రూ.10లక్షల పట్టివేత

నార్కట్‌పల్లి, దేవరకొండ, ఏప్రిల్ 6: నల్లగొండ జిల్లాలో శనివారం నిర్వహించిన తనిఖీల్లో రూ. 10 లక్షలు పట్టుకున్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి నిబంధనలకు విరుద్ధంగా ఆధారాలు లేకుండా కొందరు డబ్బులు తరలిస్తుండగా తనిఖీల్లో భాగంగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు.

● నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.4లక్షలను శనివారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ ఎన్.అంతిరెడ్డి తెలిపారు. వీరిలో మహిళా సంఘం సభ్యుల నుంచి సుమారు రూ.2లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

● చింతపల్లి మండలంలో రూ.6 లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్‌ఐ యాదయ్య తెలిపారు. చింతపల్లి మండలంలోని సాయిబాబా ఆలయ వద్ద తనిఖీలు చేపట్టారు. నసర్లపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య నిబంధనలకు విరుద్ధంగా లక్ష రూపాయలు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. సాయంత్రం నసర్లపల్లి రిజర్వాయర్ వద్ద స్పెషల్ పోలీసులు, స్పెషల్ పార్టీ తనిఖీలు నిర్వహించి దేవరకొండ మండలం మడమడక గ్రామానికి చెందిన నారవబోయిన శ్రీకాంత్ వద్ద రూ.5 లక్షలు పట్టుకున్నట్లు తెలిపారు. పంచనామా నిర్వహించి జిల్లా ఉన్నతాధికారులకు పంపినట్లు ఆయన తెలిపారు. మొత్తం రూ. 6 లక్షలు పట్టుబడినట్లు ఎస్‌ఐ యాదయ్య వెల్లడించారు.

బీఆర్‌ఎస్ నాయకులకు మతి భ్రమించింది

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్, ఏప్రిల్ 6: రాష్ట్రంలో పదేళ్లపాటు ముఖ్యమంత్రిగా చేసిన కేసీఆర్, ఆ పార్టీ నాయకులకు మతి భ్రమించిందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణంలోని పన్నాలగూడెం క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై గద్దల్లాగా వాలుతానని కేసీఆర్ అంటున్నారని, గద్దలు, డేగలు శ్మశానంలో వాలతాయే తప్ప ప్రజల మధ్య కాదని విమర్శించారు.మాజీ సీఎం గాయిగాయిగా మాట్లాడుతున్న భాషను చూస్తుంటే మైండ్ పూర్తిగా ఖరాబైనట్లు అనిపిస్తుందన్నారు. రాష్ట్రంలో ఇరిగేషన్, హెల్త్, విద్యావ్యవస్థను నాశనం చేసింది బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాదా అని ఆయన ప్రశ్నించారు. నాగార్జునసాగర్ ఉప ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు లిఫ్ట్‌ను ఏడాదిలో పూర్తి చేస్తానని, కేసీఆర్ అప్పటి మంత్రిగా ఉన్న జగదీష్‌రెడ్డి హామీ ఇచ్చి ఇంతవరకు మొదలు పెట్టలేదన్నారు. ఉమ్మడి జిల్లా మాజీ మంత్రి చెప్పేదంతా అసత్యం, అబద్ధంగా ఉంద ని, ఉమ్మడి జిల్లాలో ఇష్టానుసారంగా భూమిని, ఇసుకను దోచుకుని ఎడారిగా మార్చారని ఆరోపించారు. లిక్కర్‌దందాలో జైలుకుపోయిన కవిత గురించి, నరేంద్రమోదీ గురించి మాట్లాడకుండా బీజేపీకి బీ టీమ్‌గా కేసీఆర్ పనిచేస్తున్నారని విమర్శించారు. కరీంనగర్ పర్యటనలో కాంగ్రెస్ పాలనపై సీఎం రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి బ్రదర్స్‌పై కేసీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంభయ్య, టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు చామల శ్రీనివాస్, కట్టంగూరు మాజీ జడ్పీటీసీ యాదగిరి పాల్గొన్నారు.

ఎంజీయూ పరిధిలోని డిగ్రీ పరీక్షల ఫీజు చెల్లింపునకు
22 వరకు గడువు

నల్లగొండ, ఏప్రిల్ 6: మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ల రెగ్యులర్, 1, 3, 5 సెమిస్టర్ బ్యాక్‌లాగ్ విద్యార్థులు ఈ నెల 22వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 24 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. దీంతో సీబీసీఎస్ విధానంలో 2016 -17, 2017 -18, 2018-19 విద్యా సంవత్సరం బ్యాక్‌లాగ్ విద్యార్థుల కోసం చివరి అవకాశం కల్పించామన్నారు. ఈ నోటిఫికేషన్ ద్వారా 2016 నుంచి 2019 వరకు యునివర్సిటీ పరిధిలోని చదివిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించకపోతే ఈ నెల 22వ తేదీన వరకు ఫీజు చెల్లించవచ్చని, రూ.100 అపరాధ రుసుముతో 24వ తేదీ వరకు చెల్లించాలని కోరారు.

అదుపుతప్పి బావిలో పడిన కారు

మునుగోడు, ఏప్రిల్ 6: అతివేగంతో వచ్చిన కారు అదుపు తప్పి బావిలో పడింది. నలుగురు యువకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. దీంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. ఈ ప్రమాదం మునుగోడులో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని జమస్తాన్‌పల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడి పుట్టిన రోజు వేడుకలకు సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన ఇద్దరు, అదే మండలం సర్వేల్‌తో పాటు చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామానికి చెందిన ఒక్కొక్కరు నలుగురు యువకులు హాజరయ్యారు. వేడుకల అనంతరం తిరిగి వారి ఇళ్లకు శుక్రవారం అర్ధరాత్రి తిరుగు పయనమయ్యారు. మార్గమధ్యలో మునుగోడు మండల కేంద్రం దాటిన తర్వాత మూలమలుపు వద్దగల బావిలో పడిపోయింది. దీంతో గమనించిన స్థానికులు ఆ యువకులను తాడు సహాయంతో బయటకు తీసే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులు, పోలీసులు కలిసి నలుగురు యువకులను బయటకు తీశారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించారు. వారికి స్వల్ప గాయాలు మినహా ఏమి కాకపోవటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

యువకుడికి తీవ్రగాయాలు

మునుగోడు, ఏప్రిల్ 6: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రంలోని చొల్లేడు రహదారిలోని చర్చి సమీపంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. చొల్లేడు గ్రామానికి చెందిన మేడ రాకేష్ అనే యువకుడు తన సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై మండల కేంద్రానికి వచ్చి తిరుగుపయనమయ్యాడు. చొల్లేడు మార్గంలో చర్చి సమీపంలో జరిగిన ప్రమాదంలో రాకేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో పడిపోయిన బాధితుడిని గమనించిన స్థానికులు వెంటనే ఆస్పత్రి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రానికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : బాలునాయక్


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఏప్రిల్ 6: మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ పట్టణంలోని డిండి రోడ్డులో ఈద్గా మక్కా మజీద్‌లో రంజాన్ పురస్కరించుకొని శనివారం పేద ముస్లింలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేసి మాట్లాడారు. ఈద్గా అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎం.ఎ.సిరాజ్‌ఖాన్, జాల నర్సింహారెడ్డి, ఈద్గా అధ్యక్షుడు అజిమొద్దీన్, నజీర్ అహ్మద్, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, దస్తగిరి, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఇందిర

మర్రిగూడ, ఏప్రిల్ 6: రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని స్త్రీ నిధి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు గాలెంకల ఇందిర అన్నారు. నాంపల్లి మండల కేంద్రంలో మార్కెట్ యార్డులో డీఆర్‌డీఏ, సెర్ప్, ఐకేపీ ద్వారా నిర్వహించనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,203, కామన్ గ్రేడ్ రూ.2,183 ధరకు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి రైతులు మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం వినోద్‌కుమార్, సీసీఎం సత్యనారాయణ, నాగమణి, సత్తయ్య, శ్రీశైలం, రైతులు శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, సాగర్ పాల్గొన్నారు.

మహిళా రైతులకు శిక్షణ


మహిళలకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త జ్యోతి

కట్టంగూరు, ఏప్రిల్ 6: మండలంలోని అయిటిపాముల గ్రామపంచాయతీ పరిధిలోని గంగాదేవిగూడెం వద్ద ఏర్పాటు చేసిన కట్టంగూరు ఎఫ్‌పీవోలో మహిళలకు నిమ్మకాయ, మామిడి, టమాటా పచ్చళ్లపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీ నుంచి వచ్చిన శాస్త్రవేత్త జ్యోతి మహిళలకు పచ్చళ్ల తయారీపై అవగాహన కల్పించి మహిళలతో పచ్చళ్లు పెట్టించారు. కార్యక్రమంలో మండలంలోని అయిటిపాముల, గంగాదేవిగూడెం, చెరువుఅన్నారం, గార్లబాయిగూడెం, తేలువారిగూడెంతో పాటు శాలిగౌరారం మండలంలోని పల్లాలకు చెందిన మహిళ సంఘాల గ్రూపు సభ్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో కట్టంగూరు ఎఫ్‌పీవో చైర్మన్ చెవుగోని సైదమ్మ, హార్టికల్చర్ అధికారి రావుల విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం కృషి

చిట్యాల, ఏప్రిల్ 6: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. చిట్యాలలో శనివారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్లమెంటులో ప్రజావాణిని వినిపించేందుకు సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బీజేపీ మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయం చేస్తుందని విమర్శించారు. బీజేపీకి వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యవాదులను ఏకం చేస్తామన్నారు. కార్యక్రమలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి, మండల కార్యదర్శి అరూరి శ్రీనివాసులు, జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, పాముగుల్ల అచ్చాలు, శీలా రాజయ్య పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాలకు సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న రేకల భద్రాద్రి

నల్లగొండ, ఏప్రిల్ 6: స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకుని నిరుద్యోగ యువతులు ఆర్థికంగా అభివృద్ధిని సాధించాలని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, ట్రస్ట్ అధ్యక్షుడు రేకల భద్రాద్రి అన్నారు. రేకల అన్నమ్మ చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గ్రేస్ ఇవాంజికల్ బాపిస్టు చర్చిలో శనివారం నిరుద్యోగ యువతులకు నిర్వహించిన శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఫినాయిల్, సబ్బులు, వివిధ బామ్‌లు, వ్యాజిలిన్‌ను తయారు చేయడంలో శిక్షణ పొంది ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలన్నారు. మహిళలు శిక్షణ పొందడం ద్వారా వృత్తిలో రాణించి ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రేకల శైలజ, రేకల సునీల్, సుదాంస్, మోజస్, కె.యేవెలు, కె.శేఖర్, పాస్టర్లు వసంతకుమార్, యోహోస్, రవీందర్, రెబిక, కుమారి, పెప్సీబా, సోని పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాపాడుకోవాలి

నల్లగొండరూరల్, మర్రిగూడ, ఏప్రిల్ 6: మనువాద బీజేపీని ఓడించి, కార్మికుల హక్కులను కాపాడుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, నాయకుడు ఏర్పుల యాదయ్య అన్నారు. సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు బీటీ రణదివె వర్ధంతిని నల్లగొండ, మర్రిగూడలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్మికుల సమస్యలపై కార్మికుల హక్కుల కోసం కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై నిరంతరం పోరాడిన వ్యక్తి రణదీవేనని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, నాయకులు నర్సింహ, సత్యనారాయణ, సైదాచారి, ముత్తమ్మ, దుర్గమ్మ, యాదగిరి, జంగమ్మ, హేమలత, ఇందిరమ్మ, నీలకంఠ రాములు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


దేవరకొండలో నిర్వహించిన దీక్షలో మాట్లాడుతున్న రవీంద్రకుమార్

దేవరకొండ, హాలియా, చండూరు, మిర్యాలగూడ, నకిరేకల్, ఏప్రిల్ 6: పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఎమ్మెల్సీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు జిల్లాలోని నియోజవర్గ కేంద్రాల్లో రైతు నిరసన దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగర్ ఎడమ కాల్వ కింద పంట సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నాయకుల అబద్ధపు హామీలను నమ్మి ప్రజలు మోసపోయారని, ఆ హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. 2లక్షల రైతు రుణమాఫీ, రైతుబంధు రూ.15 వేలు, ధాన్యం, మక్కలకు 500 బోనస్, రైతు కూలీలకు రూ.12వేలు, కౌలు రైతులకు రూ.15వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని అమలు చేయలేదని అన్నారు.

● దేవరకొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుదీక్షలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ పాల్గొని మాట్లాడారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో 200మంది రైతులు చనిపోయారని, వారి కుటుంబాలను మంత్రులెవరు పరామర్శించ లేదని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కేతావత్ బీల్యానాయక్, రాజినేని వెంకటేశ్వరరావు, గాజుల అంజనేయులు, వెంకటరమణరెడ్డి, రాఘవచారి, జానిబాబా, రాజు, కృష్ణ పాల్గొన్నారు.

● అనుముల మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన దీక్షలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ పాల్గొని మాట్లాడారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చెన్ను సుందర్‌రెడ్డి, ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్, జానయ్య, వడ్డె సతీష్‌రెడ్డి, కూరాకుల వెంకటేశ్వర్లు, పిడిగం నాగయ్య, ఏడుకొండలు, సురభి రాంబాబు, పంగ లక్ష్మణ్, రవినాయక్, ఆంజనేయులు, ఉర్లగొండ వెంకటయ్య, శాగం కోటిరెడ్డి, అంజిరెడ్డి, ఎల్లయ్య, అల్లి పెద్దిరాజు, ఎల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

● చండూరు పట్టణంలో నిర్వహించిన దీక్షలో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంలో జాప్యం ఎందుకు చేస్తుందని ప్రశ్నించారు. చండూరు మునిసిపాలిటీని అభివృద్ధి తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే జరిగిందని, నిధులున్నా మిగిలిన పనులు చేయలేకపోతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, వైస్ ఎంపీపీ అవ్వారు గీతశ్రీనివాస్, మునిసిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళవెంకన్న, నాయకులు పల్లె రవికుమార్, సుదర్శన్, సతీష్, నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అన్నదాతలు అగచాట్లు పడుతున్నారని అన్నారు. ఎడమ కాల్వకు నీటి విడుదల కొనసాగించి నీటి సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం ఆర్డీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు.


మిర్యాలగూడలో మాట్లాడుతున్న భాస్కర్‌రావు, చిత్రంలో కృష్ణారెడ్డి


హాలియాలో దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భగత్

కార్యక్రమంలో నాయకులు తిప్పన విజయసింహారెడ్డి, దుర్గంపూడి నారాయణరెడ్డి, మోసిన్‌అలీ, వీరకోటిరెడ్డి, బాలాజీనాయక్, నాగార్జునాచారి, యాదగిరిరెడ్డి, షోయబ్, హతీరాం, నాయకులు పాల్గొన్నారు.

● నకిరేకల్‌లో పట్టణంలో నిర్వహించిన రైతుదీక్షలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే కరువు వచ్చిందని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, నకిరేకల్, కట్టంగూరు జడ్పీటీసీలు మాద ధనలక్ష్మి, తలారి బలరాం, నూక సైదులు, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి, పలువురు ఎంపీటీసీలు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.


చండూరులో నిర్వహించిన దీక్షలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

తుక్కుగూడకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

నల్లగొండటౌన్, ఏప్రిల్ 6: హైదరాబాద్‌లోని తుక్కుగూడలో నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ జనజాతర సభకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో పార్టీశ్రేణులు తరలివెళ్లాయి. నల్లగొండ నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు వాహనాల్లో తరలి వెళ్లారు. నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల మైదానంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, పలువురు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన సైదులు ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

● పెద్దఅడిశర్లపల్లి మండలం నుంచి కాంగ్రెస్ జడ్పీటీసీ అలుగుబెల్లి శోభారాణిఏవీరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు వాహనాల్లో తరలివెళ్లారు.

● కట్టంగూరు నుంచి తరలివెళ్లిన వారిలో నాయకులు మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ, రెడ్డిపల్లి సాగర్, గుండు పరమేష్, శివశంకర్, వీరస్వామి, అనిల్‌రెడ్డి ఉన్నారు.

● దేవరకొండ నియోజకవర్గం నుంచి 90 బస్సులతో పాటు పలు వాహనాల్లో కాంగ్రెస్ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలను తరలించినట్లు ఎమ్మెల్యే బాలునాయక్ తెలిపారు. జనజాతర బహిరంగ సభకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి వాహనాలు ఏర్పాటు చేసి పార్టీ కార్యకర్తలు, నాయకులను బహిరంగ సభకు తరలించినట్లు తెలిపారు.

● తిరుమలగిరి(సాగర్) మండలం నుంచి సుమారు 30 ప్రైవేట్ బస్సుల్లో కార్యకర్తలు సభకు వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రమావత్ కృష్ణానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ కలసాని చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

● చండూరు నుంచి మునిసిపాలిటీ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్, మునిసిపల్ వైస్‌చైర్మన్ దోటి సుజాతవెంకటేశ్‌యాదవ్, నాయకులు కోడి శ్రీనివాసులు, శేఖర్ వెళ్లారు.


నల్లగొండలో వాహనాలను ప్రారంభిస్తున్న మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి

● మర్రిగూడ, నాంపల్లి మండలాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. తరలి వెళ్లిన వారిలో శ్రీరాందాసు శ్రీనివాస్, మేతరి యాదయ్య, ఏర్పుల శ్రీశైలం, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చిట్యాల రంగారెడ్డి, నగేష్, జంగయ్య తదితరులు ఉన్నారు.

● నిడమనూరు నుంచి తరలిని వారిలో నాయకులు రంగశాయిరెడ్డి, వెంకట్‌రాహుల్, అంకతి సత్యం, నందికొండ మట్టారెడ్డి, అంకతి వెంకటరమణ, వల్లభ్‌రెడ్డి, చినవీరయ్య, బొల్లం శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, శివమారయ్య ఉన్నారు.

● గుర్రంపోడు మండల అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్య యాదవ్ ఆధ్వర్యంలో చెనమల జగదీశ్వర్‌రెడ్డి, కాసర్ల ధర్మయ్య, సోమ రాములు, నాయకులు తరలివెళ్లారు.

● మునుగోడులో పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు పార్టీ జెండాను ఊపి వాహనాలను ప్రారంభించారు.

● కనగల్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో నర్సింగ్ కృష్ణయ్యగౌడ్, మురళిగౌడ్, పెద్దులు పాల్గొన్నారు.

● మాడ్గులపల్లి మండలంలోని అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుల్లెంల సైదులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


జిల్లా పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న వర్షిత్‌రెడ్డి, సైదిరెడ్డి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్): భారతీయ జనతా పార్టీ నిర్మాణం కోసం ఎంతో మంది మహానుభావుల ప్రాణత్యాగం, పోరాటం దాగి ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో శనివారం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండిట్ దీన్‌దయాళ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బీజేపీ జెండాను ఆవిష్కరించారు. పలు చోట్ల టిఫిన్ బైఠక్ నిర్వహించి చర్చించుకున్నారు.

● జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పండిట్ దీన్‌దయాళ్ విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు సీట్లతో ప్రస్థానం ప్రారంభించి నేడు 303 సీట్లతో దేశంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మూడోసారి అధికారంలోకి రానున్నట్లు సర్వేలు చెబుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, మెహబూబాబాద్ ప్రబారి నూకల వెంకటనారాయణరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతేపాక లింగస్వామి, కోశాధికారి పకీరు మోహన్‌రెడ్డి, మహేష్, ముత్యాల్‌రావు, కాశమ్మ, నీరజ పాల్గొన్నారు.

మర్రిగూడ, నార్కట్‌పల్లి, చిట్యాల, మునుగోడు మండలాల్లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ బీజేపీని బలోపేతం చేయడానికి ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని అన్నారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

నల్లగొండ, ఏప్రిల్ 6: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 7వ తేదీన ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

నల్లగొండటౌన్, ఏప్రిల్ 6: ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ ఎం. నాగరాజు అన్నారు. తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశానుసారం నార్కట్‌పల్లికి చెందిన కామినేని వైద్యుల సమన్వయంతో శనివారం జిల్లా కోర్టు సముదాయంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జడ్జి బి.తిరుపతి, రెండో అదనపు జడ్జి జి.సంపూర్ణ ఆనంద్, ఫ్యామిలీ కోర్టు జడ్జి డి.దుర్గాప్రసాద్, సెషన్స్ జడ్జి కె.కవిత, ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టు జడ్జి విశ్వనాథ్ దిలీప్‌రావు, లూదర్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, వెంకట్‌రెడ్డి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ కార్యాలయంలో ఇఫ్తార్‌విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఉద్యోగులు, ముస్లింలు

నల్లగొండటౌన్, ఏప్రిల్ 6: ముస్లింల పవిత్ర రంజాన్‌మాసాన్ని పురస్కరించుకొని తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం టీఎన్జీవోస్ జిల్లా కార్యాలయంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. అంతకుముందు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి, కార్యదర్శి శేఖర్‌రెడ్డి, కోశాధికారి జయరావు, జిల్లా మాజీ అధ్యక్షుడు ఏడుదొడ్ల వెంకట్‌రాంరెడ్డి, మామిడాల రమేష్, టీవోవో అధ్యక్షుడు ఖాజా ఖుతుబుద్దీన్, కార్యదర్శి శ్రీనివాస్, ఏఏఖాన్, హౌజింగ్ పీడీ రాజ్‌కుమార్, విశ్రాంత ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, మౌలానాలు, ముస్లింలు ఉద్యోగులు హలీమ్, జహంగీర్, నజీర్, తాలుకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

● **పెద్దఅడిశర్లపల్లి:** మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద గల మసీదులో ముస్లింలకు అదే గ్రామానికి చెందిన షేక్ నిరంజన్ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండలంలోని సుమారు 50 మంది ముస్లింలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, అంతిరెడ్డి, ఇబ్రహీం, రహీం, ఇంతియాజ్, వలీ, షబ్బీర్, కాదర్, బాబ్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

సిలువేరు నర్సింహ మృతి పార్టీకి తీరని లోటు


నర్సింహకు నివాళులర్పిస్తున్న ముదిరెడ్డి, వీరారెడ్డి

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 6: సీపీఎం సీనియర్ కార్యకర్త సిలువేరు నర్సింహ మృతి పార్టీకి తీరని లోటని పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అవురవాణి గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ కార్యకర్త సిల్వేరు నర్సింహ (75) శుక్రవారం రాత్రి మృతి చెందాడు. అవురవాణిలో నర్సింహ మృతదేహంపై పార్టీ జెండాను కప్పి ఘనంగా నివాళులర్పించారు. అవురవాణిలో పార్టీ బలోపేతానికి నర్సింహ చేసిన సేవలను కొనియాడారు. ఆయన వెంట సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు శ్రీరామోజు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి చెర్కు పెద్దులు, పుచ్చకాయల నర్సిరెడ్డి, ఎంపీటీసీ శ్రీరామోజు జయలక్ష్మివెంకటేశ్వర్లు, నాయకులు కంఠమహేశ్వర్, నర్సింహ, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

నల్లగొండ: నల్లగొండ మునిసిపాలిటీలో 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నులను ఈ నెల 30వ తేదీలోగా చెల్లిస్తే ఐదు శాతం రాయితీ ఇవ్వనున్నట్లు మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మిర్యాలగూడటౌన్: అధికారంలోకి వస్తే రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించడంపై బీసీ సంఘం నాయకులు జాజుల లింగంగౌడ్, వెంకటేశ్వర్లు, అంజి, శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

మునుగోడు రూరల్: మునుగోడు మండలం కల్వకుంట్ల గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి రూ.1 లక్ష విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడానికి సీసీ కెమెరాలు ముఖ్యపాత్ర వహిస్తాయని అన్నారు.

నార్కట్‌పల్లి: ఆరోగ్య సమాజ స్థాపనే లక్ష్యంగా పనిచేయాలని నార్కట్‌పల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రామకృష్ణ తమ సిబ్బందికి పిలుపునిచ్చారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సిబ్బందిని చౌటుప్పల్‌కు చెందిన రామస్వామి కమలమ్మ ఫౌండేషన్ సౌజన్యంతో జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో బడుగు శ్రీరాములు, చంద్రకళ, శేఖర్, శ్రీనయ్య, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టులో గల నకిరేకల్ ఎస్సీ గురుకుల పాఠశాలలో వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన పాఠశాలకు చెందిన 29 మంది విద్యార్థులను ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మేడి హరికృష్ణ సన్మానించి అభినందించారు.

కేతేపల్లి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కేతేపల్లి గ్రామ పంచాయతీ కార్మికుడు గద్దపాటి లచ్చయ్య కుటుంబానికి పంచాయతీ నుంచి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈజీఎస్ఏపీవో సురేందర్, పీఎస్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మునుగోడురూరల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల సంక్షేమ కమిటీ జిల్లా చైర్మన్ చింతకాయల కృష్ణ అన్నారు. మండలంలోని పలివెల జడ్పీ హైస్కూల్ ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియాలో ఎంపికైన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు బాల్య వివాహపై నిరోధక చట్టం, బాలలకు నిర్బంధ విద్యా విధానం గురించి ఆయన వివరించారు.

మాడ్గులపల్లి: మండలంలోని మాచనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం అకుల్‌బేగం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

గుర్రంపోడు: గుర్రంపోడు మండలంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి అన్నారు. స్వార్థ రాజకీయ నాయకులు పార్టీని వీడినంత మాత్రాన కార్యకర్తలు ఎవరూ పార్టీని విడిచిపెట్టలేదన్నారు. పార్టీలు మారిన వారు ఎప్పుడు ఏ పార్టీ అధికారంలోకి ఉంటే ఆ పార్టీలోకి వెళ్తుంటారని విమర్శించారు.

మునుగోడు రూరల్: మునుగోడు మండలం కొరటికల్ గ్రామానికి చెందిన శిర్గమళ్ల కిషోర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. 'తెలంగాణ సాయుధ పోరాటంలో దళితుల పాత్ర' అనే అంశంపై కిషోర్ విశ్రాంత ఆచార్యులు కె.రామకృష్ణ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు ఉస్మానియా యూనివర్సిటీ పరీక్షల విభాగం డాక్టరేట్ అందజేసింది. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించడంతో పాటు కేసులు కూడా ఎదుర్కొన్నారు. పరిశోధన సమయంలో పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశోధన పత్రాలు సమర్పించారు.

దేవరకొండ: కేంద్రంలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలునాయక్, కర్నాటి సురేష్ అన్నారు. దేవరకొండ పట్టణంలోని 77వ బూత్‌లో బూత్‌కమిటీ అధ్యక్షుడు శివకర్ ప్రమోద్‌తో కలిసి పార్టీ జెండాను ఎగురవేసి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్, ఉప్పల వెంకటేష్, నక్క వెంకటేష్, సాంబయ్య, కృష్ణ, వస్కుల సుధాకర్, సహదేవ్, భాస్కర్, రెడ్డిశంకర్ పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: శ్రీషిర్డీ సాయిబాబాపై ఉన్న భక్తితో భక్తులు వందల కిలోమీటర్ల వరకు పాదయాత్ర చేపట్టారు. ఆ పాదయాత్ర మండలంలోని వట్టిమర్తిలో సాయిబాబా ఆలయానికి చేరింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పేరికలపాడు నుంచి శానంపూడి శ్రీహరి మహారాష్ట్రలోని షిర్డీ సాయిబాబా ఆలయం వరకు సాయి భక్తులతో కలిసి పాదయాత్ర చేపట్టారు. పేరికలపాడులోని చిన్నసాయిబాబా ఆలయ ధర్మకర్త శ్రీహరి అక్కడి ఆలయం నుంచి ఈ నెల 1వ తేదీన పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ 13వ సారి పాదయాత్రను చేస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి పరీక్షలు రాసిన తన కుమారుడు సాయిరోషన్, తమ గ్రామానికి చెందిన మరో యువకుడు లంక మహేష్ మొదటిసారి పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 16వ తేదీ వరకు షిర్డీకి చేరుకుంటామని పేర్కొన్నారు.

నకిరేకల్: ప్రజా సమస్యలపై పోరాడుతున్న భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. నకిరేకల్‌లోని నర్రా రాఘవరెడ్డి భవన్‌లో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ప్రజలను కులాలు, మతాలుగా విడగొట్టి మనువాద వారసత్వాన్ని అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు, సహజ వనరులను బీజేపీ కార్పొరేట్ పరం చేయడం వల్ల పేద, ధనిక వర్గాల మధ్య రోజురోజుకు దూరం పెరుగుతుందన్నారు. సమావేశంలో నాయకులు కందాళ ప్రమీల, వెంకట్‌గౌడ్, వెంకటేశ్వర్లు, లక్ష్మి, నర్సింహ, వెంకటయ్య, అంజయ్య పాల్గొన్నారు.

కనగల్: మండలానికి చెందిన ఇరువురికి ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్ వారి ఉగాది పురస్కారాలు దక్కాయి. కనగల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మండల కోఆప్షన్ ఎండీ హఫీజుద్దీన్, మార్తినేనిగూడెం గ్రామపంచాయతీ బండమీదిగూడెం గ్రామానికి చెందిన జలసాధన సమితి నాయకుడు బండమీది అంజయ్య సతీమణి బండమీది పరమేశ్వరికి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో వారికి వేర్వేరుగా ఈ అవార్డులను ప్రదానం చేశారు.